మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 254
పేజీలు : 3

ఆదివారం 12.04.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ





# అమెరికా .. ఇజ్రాయెల్ న

# ఎవరు ఫస్ట్..?








- చర్చల వేళ ఇరాన్ వైస్ ప్రెసిడెంట్ వ్యాఖ్యలు
- పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్

**టి మీడియా, ఏప్రిల్ 11,ఢిల్లీ బ్యూరో:** పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో అమెరికా – ఇరాన్ శాంతి చర్చలు మొదలైన వేళ ఇరాన్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ రజా ఆరిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఫస్ట్ నినాదం కలిగిన ప్రతినిధులతో ఇరాన్ ప్రతినిధులు సమావేశమైతే, తద్వారా కుదిరే ఒప్పందం ఇరుపక్షాలకు, యావత్ ప్రపంచానికి ప్రయోజనకరంగా ఉంటుంది ఆయన అన్నారు. ఒకవేళ ఇజ్రాయెల్ ఫస్ట్ నినాదం కలిగిన ప్రతినిధులతో ఇరాన్ ప్రతినిధులు భేటీ కావాల్సి వస్తే, కచ్చితంగా ఎలాంటి ఒప్పందమూ కుదరదని తేల్చి చెప్పారు. అలాంటి పరిస్థితే ఎదురైతే, తాము ఇరాన్ రక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని రజా ఆరిఫ్ స్పష్టం చేశారు. దీనికి భారీ మూల్యాన్ని ప్రపంచం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు.పాకిస్థాన్?లో అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు ప్రారంభమయ్యాయి. పాక్ మధ్యవర్తిత్వంతో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలో అమెరికా బృందం, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ నేతృత్వంలోని ఇరాన్ బృందం చర్చలు కొనసాగుతున్నాయి.

### పాక్ ప్రధానితో ఇరాన్ ప్రతినిధుల భేటీ

యావత్ ప్రపంచం ఆసక్తిగా పరిశీలిస్తున్న అమెరికా, ఇరాన్ అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందాల శాంతి చర్చలు పాకిస్థాన్ రాజధాని నగరం ఇస్లామాబాద్ వేదికగా మొదలయ్యాయి. శనివారం ఉదయాన్నే ఇరాన్ ప్రతినిధులు ఇస్లామాబాద్‌లో తాము ఆతిథ్యం పొందిన భవనం నుంచి పాక్ ప్రధానమంత్రి కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. వారు తొలుత పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో భేటీ అయ్యారు. ఈమేరకు వివరాలతో ముంబయిలోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇరాన్ ఒక ట్వీట్ చేశారు.

### ఫైవ్ స్టార్ హోటల్ వేదికగా చర్చలు

అల్ జజీరా కథనాల ప్రకారం, ఇస్లామాబాద్ నగరంలోని ఒక ఫైవ్ స్టార్ హోటల్ వేదికగా అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి వారి మధ్య ముఖాముఖి చర్చలు జరగడం లేదు. ఈ రెండు దేశాల ప్రతినిధి బృందాలు ఫైవ్ స్టార్ హోటల్‌లోని వేర్వేరు గదుల్లో కూర్చున్నాయి. వారు పాకిస్థాన్ అధికారుల ద్వారా పరస్పరం తమ సందేశాలను ఇచ్చి పుచ్చుకుంటున్నారు. లెబనాన్‌లోనూ కాల్పుల విరమణ జరగాల్సిందే అని ఇరాన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. శాంతి ఒప్పందంలో లెబనాన్ కూడా ఉండాలని వారు కోరుతున్నారు. ఖతార్ సహా పలు దేశాల్లో ఉన్న తమ నిధులను అన్ ఫ్రీజ్ (విడుదల) చేయాలనే డిమాండ్‌నూ ఇరాన్ తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది.

### అమెరికా, ఇరాన్ ప్రతినిధులు వీరే

అమెరికా ప్రతినిధి బృందంలో వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ అడ్వైజర్, అల్లుడు జేర్డ్ కుష్నెర్ ఉన్నారు. ఇక ఇరాన్ ప్రతినిధి బృందంలో పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ఉన్నారు. అమెరికా ప్రతినిధి బృందం ప్రత్యేక విమానంలో శనివారం తెల్లవారుజామునే ఇస్లామాబాద్‌కు చేరుకుంది. ఇక ఇరాన్ ప్రతినిధులతో కూడిన విమానం శుక్రవారం రాత్రి పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించగానే, దాని చుట్టూ యుద్ధ విమానాలను మోహరించి ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్(అవాక్స్)తో పాకిస్థాన్ వాయుసేన భద్రతను కల్పించింది. ఇరాన్ విమానం ఇస్లామాబాద్‌కు చేరుకునే వరకు ఇదే విధమైన పకడ్బందీ పహారాను అందించారు.

### 15 రోజుల డెడ్‌లైన్ : రాబోయే 48 గంటలు కీలకం

ఇస్లామాబాద్‌లో అమెరికా, ఇరాన్ చర్చలకు 15 రోజుల డెడ్‌లైన్‌ను ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ పెట్టింది. ఏప్రిల్ 8 (బుధవారం) నుంచి అమల్లోకి వచ్చిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ప్రాతిపదికన ఈ గడువును విధించింది. 15 రోజుల డెడ్‌లైన్ ప్రకారం, కాల్పుల విరమణ ఒప్పందం ఏప్రిల్ 22న ముగియనుంది. అప్పట్లోగా అమెరికా – ఇరాన్‌లు పరస్పర అవగాహనకు రావాల్సి ఉంటుంది. ప్రత్యేకించి రాబోయే 48 గంటల పాటు ఇస్లామాబాద్‌లో జరగనున్న ఇరుదేశాల చర్చల ఫలితాల కోసం యావత్ ప్రపంచ దేశాలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. ఇస్లామాబాద్‌లో జరుగుతున్న శాంతి చర్చలను అత్యంత కీలకమైన సంప్రదింపులుగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అభివర్ణించారు. తాత్కాలికంగా అమెరికా – ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ దౌత్య పరిష్కారానికి దారితీస్తుందా ? లేదంటే మళ్లీ సైనిక ఘర్షణ మొదలవుతుందా ? అనే దానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

### ముందే రెండు డిమాండ్లు పెట్టిన టెహ్రాన్

. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని అమెరికా బృందం, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ నేతృత్వంలోని ఇరాన్ బృందం ఈ చర్చల్లో పాల్గొనబోతోంది. శాంతి చర్చలకు ముందు ఇరాన్ ప్రతినిధులు పాక్ ప్రధాని షరీఫ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చర్చల ప్రారంభానికి ముందే ఇరాన్ రెండు డిమాండ్లు పెట్టంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు తక్షణమే ఆగాలన్న ఇరాన్ డిమాండ్ చేసింది. స్తంభింపజేసిన తమ ఆస్తులు విడుదల చేయాలంటూ షరతులు విధించంది.

## జ్యోతిరావు పూలే జయంతి..

- నివాళులర్పించిన రాష్ట్రపతి, ప్రధాని మోదీ

**టి మీడియా, ఏప్రిల్ 11,న్యూఢిల్లీ:**




ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. సమానత్వం, న్యాయం, విద్య కోసం తన జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని కొనియాడారు. మహిళలు, అణగారినవర్గాల హక్కుల పరిరక్షణలో పూలే మార్గదర్శి అన్నారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అన్నారు. ఢిల్లీలో జ్యోతిరావుపులే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలేకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం నివాళులర్పించారు.అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని ఆమె పేర్కొన్నారు. "మహాత్మా జ్యోతిరావు పూలే తన జీవితాన్ని అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితం చేశారు. మహిళా విద్య పురోగతికి ఆయన గణనీయమైన కృషి చేసి, సామాజిక సంస్కరణలు, సమ్మిళితత్వం అనే శాశ్వత వారసత్వాన్ని వదిలివెళ్లారు," అని రాష్ట్రపతి ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ ఆవరణలోని పులే విగ్రమానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఉపరాష్ట్ర పతి, ప్రధాని మోదీ, లోక్ సభ స్పీకర్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పులే విగ్రహానికి నివాళులర్పించారు. పూలే ఏప్రిల్ 11, 1827న మహారాష్ట్రలో జన్మించి, నవంబర్ 28, 1890న మరణించారు.

## వాట్సాప్ ద్వారా ఇంటర్మీడియట్ ఫలితాలు







### -మీ సేవ వాట్సాప్ ప్లాట్‌ఫామ్‌లో 580కు పైగా సేవలు

**టి మీడియా,ఏప్రిల్ 11,హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో డిజిటల్ సేవల విస్తరణ వేగంగా కొనసాగుతోంది. ప్రజలకు సులభంగా, వేగంగా ప్రభుత్వ సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ ప్లాట్‌ఫామ్ ప్రస్తుతం 580కు పైగా సేవలను అందిస్తూ రాష్ట్రంలో ప్రముఖ డిజిటల్ సేవా వేదికగా నిలుస్తోంది.2025 నవంబర్ 18న ప్రారంభమైన ఈ సేవలు తక్కువ సమయంలోనే విస్తృతంగా ప్రజాదరణ పొందాయి. ప్రజలు 8096958096 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సందేశం పంపడం ద్వారా వివిధ ప్రభుత్వ సేవలను సులభంగా పొందవచ్చు.తాజాగా ఈ సేవల్లో భాగంగా తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు పరీక్ష ఫలితాలను వాట్సాప్ ద్వారా పొందే సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏప్రిల్ 12, 2026 నుండి విద్యార్థులు తమ ఫలితాలను నేరుగా వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే వీలుంటుంది. ఈ విధానంతో వెబ్‌సైట్‌లలో లాగిన్ కావడం లేదా మీ సేవ కేంద్రాలను సందర్శించడం అవసరం ఉండదు.ఇప్పటికే లక్షలాది మంది విద్యార్థులకు ఇంటర్మీడియట్ మరియు ఎస్సెస్సీ హాల్ టికెట్లను ఉచితంగా, తక్షణం అందించిన ఈ ప్లాట్‌ఫామ్, విద్యార్థులకు మరింత సౌలభ్యం కల్పిస్తోంది.విద్యార్థులు తమ ఫలితాలను పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను MeeSeva Telanganaగా సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో Hi మెసేజ్ పంపాలి. అనంతరం BIE Exam Result సేవను ఎంపిక చేసి, తమ రోల్ నంబర్, సంవత్సరం (1వ లేదా 2వ సంవత్సరం), స్ట్రీమ్ (జనరల్ లేదా వొకేషనల్) వివరాలను నమోదు చేసి సమర్పిస్తే, ఫలితం వెంటనే వాట్సాప్‌లో అందుతుంది.ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మీ సేవ వాట్సాప్ సేవలు ప్రజలు ప్రతిరోజూ వినియోగించే డిజిటల్ వేదికల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రతి ఇంటికి చేరవేసే వినూత్న చర్యగా నిలుస్తున్నాయని తెలిపారు.

## యూపీఐ పేమెంట్స్‌కు పదేళ్లు పూర్తి..

### 49 శాతం వాటాతో భారత్‌దే అగ్రస్థానం

**టి మీడియా, ఏప్రిల్ 11,ఢిల్లీ బ్యూరో:** భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ఇవాళ్టితో పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలను వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న రియల్-టైమ్ చెల్లింపుల లావాదేవీల్లో ఏకంగా 49 శాతం వాటాతో భారత్ అగ్రస్థానంలో నిలిచిందని తెలిపింది. గణాంకాల ప్రకారం.. కేవలం 2026 జనవరి నెలలోనే యూపీఐ ద్వారా 21.70 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ.28.33 లక్షల కోట్లు.దేశంలోని మొత్తం రిటైల్ డిజిటల్ లావాదేవీల్లో 81 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ప్రారంభమైన నాటి నుంచి లావాదేవీల పరిమాణంలో 12,000 రెట్లు, విలువలో 4,000 రెట్లకు పైగా వృద్ధిని యూపీఐ నమోదు చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ సైతం యూపీఐని ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపుల వ్యవస్థగా అభివర్ణించింది. కేవలం లావాదేవీల సంఖ్యకే పరిమితం కాకుండా యూపీఐ సామాన్యుడి జీవితంలో కూడా భాగమైంది.ఆటోరిక్షా డ్రైవర్ల నుంచి వీధి వ్యాపారులు, గ్రామీణ మార్కెట్ల వరకు యూపీఐ సేవలు విస్తరించాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య, అధికారిక, అనధికారిక ఆర్థిక వ్యవస్థల మధ్య అంతరాన్ని తగ్గించి, ఆర్థిక సమ్మిళితత్వానికి మార్గం వేసిందని ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొన్నది. భారత యూపీఐ వ్యవస్థ పనితీరు, భద్రత, వేగాన్ని ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ప్రశంసించాయి. ప్రస్తుతం యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ సహా 8 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి.భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యూపీఐ లైట్, యూపీఐ ఆటోపే, క్రెడిట్ ఆన్ యూపీఐ వంటి కొత్త సేవలను కూడా అందుబాటులోకి తెచ్చారు. దశాబ్ద కాలంలోనే దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ, నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలవడం గమనార్హం.




## హర్మూజ్ దాటిన భారత తొలి ఎల్పీజీ ట్యాంకర్

**టి మీడియా, ఏప్రిల్ 11,ఢిల్లీ బ్యూరో :**



అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత హర్మూజ్ జలసంధిని దాటిన భారత తొలి ఎల్పీజీ ట్యాంకర్ గా జగ్ విక్రమ్ నిలిచింది. ఎల్పీజీ ట్యాంకర్ జగ్ విక్రమ్ గల్ఫ్ నుంచి భారీ ఎల్పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరింది. సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటింది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత జలసంధిని దాటిన ఈ నౌక మధ్యాహ్నానికి గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోకి ప్రవేశించింది.ఈ గ్యాస్ ట్యాంకర్ 20 వేల టన్నుల ఎల్పీజీని తీసుకురానుంది. జలసంధిని దాటడానికి అనుమతి కోసం జగ్ విక్రమ్ వారం రోజులకుపైగా గల్ఫ్ జలాల్లో ఎదురుచూసినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి. ఈ ట్యాంకర్ ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ యాజమాన్యానికి చెందినదిగా తెలుస్తున్నది. మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయని, త్వరలో అవి కూడా ఇదే మార్గం గుండా భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని నివేదికలు పేర్కొన్నాయి.ఆ 15 నౌకల్లో ఒకటి ఎల్పీజీ గ్యాస్ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్‌లు, ఒక ఎల్ఎన్‌జీ ట్యాంకర్, ఒక రసాయన ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటైనర్ నౌకలు, రెండు బల్క్ క్యారియర్‌లు, మూడు ఇతర నౌకలు ఉన్నట్లు తెలుస్తున్నది.

## అంగన్వాడిల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

3లో..

## చనిపోయిన కానిస్టేబుళ్ల వివరాలతో జీతాలు డ్రా

2లో..

## ఎన్ని పార్టీలు కలిసినా మాపై విజయం సాధించలేవు

-తమిళనాడు సీఎం స్టాలిన్

3లో..

# మైక్రో ఫైనాన్స్ పేరుతో రూ.10 కోట్ల మోసం

- సింగర్ మంగ్లీపై కేసు నమోదు

**టి మీడియా,ఏప్రిల్ 11,హైదరాబాద్ బ్యూరో:**
సినీ గాయకురాలు మంగ్లీతో పాటు మరో నలుగురిపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధిక లాభాల మైక్రో ఫైనాన్స్ పేరుతో రూ.10 కోట్లు మోసం చేసినట్లు ఓ న్యాయవాది ఫిర్యాదు చేశారు. మంగ్లీతో పాటు ఆమె సోదరుడు, మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో తనకు ప్రాణహాని ఉందని న్యాయవాది సుబ్బారావు పేర్కొన్నారు. దీంతో మొత్తం ఐదుగురిని బీఎన్ఎస్ సెక్షన్ 351(2), 352 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## పెట్టుబడుల పేరిట రూ.10 కోట్ల మోసం

మైక్రో ఫైనాన్స్ పథకాలలో పెట్టుబడులు పెట్టిస్తామని నమ్మించి రమావత్ మధుపాల్ అలియాస్ భరత్ చౌహాన్, శైలజా చౌహాన్, శివ (మంగ్లీ సోదరుడు), మంగ్లీ కలిసి సుమారు రూ.9.5 నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నిధులను "గోకులానందన ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" పేరిట ఇంపోర్ట్-ఎక్స్‌పోర్ట్, రియల్ ఎస్టేట్, ట్రేడింగ్ వ్యాపారాల్లో పెట్టుబడి పెడతామని బాధితులను నమ్మించారు. ఈ నేపథ్యంలోనే హేమకాంత్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, తిరుమల్ తదితరులు భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టి మోసపోయినట్లు తెలుస్తోంది.

## మంగ్లీ డబ్బు ఆఫర్ చేసినట్లు ఆరోపణలు :

ఈ మేరకు బాధితులు తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన న్యాయవాది సింగపోగు సుబ్బారావును సంప్రదించారు. దీనిపై సింగర్ మంగ్లీని సంప్రదించగా, ఆమె అనుచితంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో తెలిపారు. అంతేకాదు ఈ కేసులో ఆమెను, తన సోదరుడు శివను చేర్చవద్దని మంగ్లీ ఆ న్యాయవాదికి డబ్బు ఆఫర్? చేసినట్లు ఆరోపించారు. ఆ తర్వాత దర్శకుడు వేణు ఊడుగుల, అడ్వకేట్ పూజారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంజాగుట్టలో సమావేశం ఏర్పాటు చేశారు.

## న్యాయవ్యాది సుబ్బారావుకు ప్రాణహాని

మంగ్లీ, వేణు, పూజారి నాగేశ్వర రావు, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి తదితరులు కేసు వేయవద్దని, అలాగే మీడియా వీడియోలు తొలగించాలని ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమావేశం ముగిసే సమయంలో వేణు ఊడుగుల బెదిరించగా, మంగ్లీ అసభ్య పదజాలంతో దూషించి హత్య చేస్తామని బెదిరించినట్లు సుబ్బారావు ఆరోపించారు. అదే విధంగా రమావత్ మధు, శివ ఫోన్ చేసి బెదిరించినట్లు తెలిపారు. దీంతో తనకు ప్రాణహాని ఉందని సుబ్బారావు పోలీసులను ఆశ్రయించగా, బీఎన్ఎస్ సెక్షన్ 351(2), 352 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# డీ అడిక్షన్, కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**టి మీడియా, ఏప్రిల్ 11,రాజన్న సిరిసిల్ల:**
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ వారోత్సవాల్లో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి శనివారం ప్రారంభించారు. అలాగే డెడికేటెడ్ సెమీ ఐసీయూ వార్డును ప్రారంభించి.. అక్కడ అందించే సేవలపై ఆరా తీశారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన రోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ లో ప్రారంభించామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. డ్రగ్స్ తో కలిగే నష్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

## కోర్టు నిర్మాణ పనుల పరిశీలన

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన కోర్టు భవన పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం పరిశీలించారు. పనుల పురోగతి పై ఆరా తీసి.. ఆర్ అండ్ బీ అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, ఆర్ ఎంఓ డాక్టర్ సంతోష్ కుమార్, తహసీల్దార్ మహేష్ కుమార్, ఆర్ అండ్ బీ అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నయీం అనుచరుడు పులిమేటి శ్రీహరి కన్నుమూత

**టి మీడియా,ఏప్రిల్ 11,హైదరాబాద్ బ్యూరో:**
నయీం ప్రధాన అనుచరుడు పులిమేటి శ్రీహరి కన్నుమూశాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సైదాబాద్ కరణ్‌బాగ్‌లోని ఆయన నివాసంలో శనివారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. భువనగిరిలో నయీం ఎన్‌కౌంటర్ తర్వాత సిట్, పోలీసుల ఒత్తిడితో 2017లో రంగారెడ్డి కోర్టులో పులిమేటి శ్రీహరి లొంగిపోయాడు. అనంతరం బెయిల్‌పై వచ్చినప్పటి నుంచి అజ్ఞాతంలోనే ఉంటున్నాడు. కాగా, పలు హత్యలు, భూ దందాలు, సెటిల్‌మెంట్లు, ఇతరత్రా కేసుల్లో అతను నిందితుడిగా ఉన్నాడు. ముసారంబాగ్ శ్మశన వాటికలో శ్రీహరి అంత్యక్రియలు చేయనున్నట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు.



# పోలీసులకు చిక్కిన డ్రగ్ క్వీన్..

- సీక్రెట్ ఆపరేషన్ సక్సెస్





**టి మీడియా, ఏప్రిల్ 11,ఢిల్లీ బ్యూరో :**
ఢిల్లీ లో మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను నడుపుతూ 'డ్రగ్ క్వీన్ (ఐతీబస్త్ర~ఋబవవఅ)' గా పేరుపొందిన కుసుమ్ అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న ఆమె ఆచూకీ కోసం పోలీసులు రెండు నెలల క్రితం సీక్రెట్ ఆపరేషన్ (రావషితీవ్ చేపట్టారు. వారాల తరబడి 200 సీసీటీవీ కెమెరాలు, 100 ఫోన్‌లను ట్రాక్ చేశారు. తాజాగా ఢిల్లీలోని షాదారా ప్రాంతంలోగల ఓ ఇంట్లో కుసుమ్ ఉన్నట్లు గుర్తించారు. సీక్రెట్‌గా ఆ ఇంట్లోకి వెళ్లి కుసుమ్‌ను అరెస్ట్ చేశారు. నిందితురాలిపై 11 కేసులు, రూ.50 వేల రివార్డు ఉన్నట్లు తెలిపారు. గతంలో కుసుమ్ ఢిల్లీలోని సుల్తాన్‌పురిలో డ్రగ్స్ విక్రయిస్తూ గ్యాంగ్‌స్టర్లతో కలిసి పనిచేసేది. క్రమంగా సొంత డ్రగ్ సిండికేట్‌ను ఏర్పాటు చేసుకొంది. ఢిల్లీలో హత్యలు, దోపిడీ, మాదకద్రవ్యాల దందాను చురుగ్గా నడిపిస్తోంది. అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించింది. పలు రాష్ట్రాలలోని మాదకద్రవ్యాల ముఠాలు ఆమె నేతృత్వంలోనే నడుస్తున్నాయి. ఆమె ఇద్దరు కుమార్తెలు, సోదరుడు కూడా ఇదే సిండికేట్‌లో పని చేస్తున్నారు. కుసుమ్ ఎక్కడా తనకు వ్యతిరేకంగా ఆధారాలు లేకుండా జాగ్రత్త పడేది. ఆమెపై అనుమానం ఉన్నప్పటికీ.. అదుపులోకి తీసుకోవడం పోలీసులకు సాధ్యం కాలేదు. 2003 నుంచి పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు. వారు దాడులు చేపట్టిన ప్రతిసారీ కుసుమ్ మాయమైపోయేది. ఫోన్‌ను ఉపయోగించకుండా కొత్త ప్రదేశాల్లో తలదాచుకుంటూ ఉండేది.




# బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే

- డాక్టర్ సతీష్ యాదవ్

**టీ మీడియా, ఏప్రిల్ 11, వనపర్తి బ్యూరో :**
విద్య లేనివాడు వివేకాన్ని కోల్పోతాడు. వివేకం లేనివాడు పురోగతిని కోల్పోతాడు. అని చాటి చెప్పిన బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సామాజిక తత్వవేత్త, నవయుగ వైతాళికుడు. 200 సంవత్సరాల క్రితం చదువుతోనే సమాజం మారుతుందని చాటి చెప్పిన సమతా మూర్తి జ్యోతిరావు పూలే 200 వ జయంతి సందర్భంగా హైదరాబాదు లోని మీడియా సెంటర్లో ఘనంగా నివాళులు అర్పించిన రాష్ట్ర బీసీ సంఘాలు, బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంఘం సూర్యరావు అధ్యక్షతన మాజీ డిజిపి పూర్ణచంద్రావు ముఖ్య అతిథిగా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు ఒక్కటై మహాత్మ జ్యోతిరావు అడుగుజాడల్లో నడవాలని, ఆయన సూచించిన సమ సమాజాభివృద్ధికి పాటుపడాలని రాబోవు కాలంలో బలహీన వర్గాలు పాలన పగ్గాలు చేతబట్టాలని దాని కోసమే బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బీసీ పెద్దలంతా పాల్గొన్న ఈ జయంతి వేడుకల్లో రాష్ట్ర నాయకులు విజయకుమార్, సూర్యనారాయణ, విజయ్ కుమార్ చంద్రశేఖర్, శివరాజు, తరుణ్, డి బాబురావు, డాక్టర్ కవిత యాదవ్, తదితరులు పాల్గొని పెద్ద ఎత్తున ఘన నివాళి అర్పించారు.



# 20న జగిత్యాలలో కేసీఆర్ సభ

- జీవన్ రెడ్డి చేరిక

**టి మీడియా, ఏప్రిల్ 11,జగిత్యాల:**
జిల్లా కేంద్రంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్బహిరంగ సభకు సంబంధించి మోతె రోడ్డు పక్కన గల స్థలాన్ని మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్మాట్లాడుతూ... రెండేళ్లలోనే రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒక్కటినీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. జగిత్యాల సభతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తామని తెలిపారు. జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరిందని పేర్కొన్నారు. జగిత్యాల సభను భారీగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని, లక్ష మందితో సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేశ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, లోక బాపురెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# తండాలో కార్డెన్ సెర్చ్



**టి మీడియా, ఏప్రిల్ 11,బెల్లంపల్లి:**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం లంబాడి తండా గ్రామంలో పోలీసులు శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. లంబడి తండా గ్రామాన్నిపోలీసులు ఆకస్మికంగా చుట్టు ముట్టారు. దేవాపూర్, కాసిపేట, రామకృష్ణాపూర్. ఎస్ ఐ లు, పోలీస్ బలగాలు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించదమంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నివాస గృహాల్లో ప్రవేశించి సోదాలు చేశారు. అనుమానస్పద వ్యక్తుల సమాచారం,అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఈ ప్రాంతంలో ఉంటున్నారా? అపరచిత వ్యక్తులకు ఇక్కడ ఎవరైనా షెల్టర్ ఇస్తున్నారా అనే కోణంలో విచారిస్తూ ప్రతి ఒక్కరి ఆధార్ కార్డ్, గుర్తింపు కార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో నివసించే వారి ద్విచక్ర వాహనాలు ఆర్ సి, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ లు చెక్ చేశారు. అదేవిధంగా సరైన ధ్రువపత్రాలు లేని, నెంబర్ ప్లేట్ లేని 43 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటికి అక్కడికక్కడే ఫైన్ వేసశారు. నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాలను సీజ్ చేశారు. పోలీసులు 180 లీటర్ల గుడుంబా పానకం ధ్వంసం చేశారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ను ఉద్దేశించి దేవాపూర్ ఎస్సై గంగారాం స్థానిక ప్రజలకు సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలపై అవగాహన, మూఢ నమ్మకాల గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలని, ట్రాఫిక్ నిబంధన లను గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో కాసిపేట, రామకృష్ణాపూర్, ఎస్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడిల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**?టి మీడియా, ఏప్రిల్ 11,తిరుమలాయపాలెం** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత అధ్యక్షతన పోషణ్ పక్వాడా కార్యక్రమం ప్రారంభోత్సవం, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మరియు సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని అంగనవాడి కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 15 వేల అంగనవాడి టీచర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 1840 అంగనవాడి కేంద్రాలు ఉండగా అందులో 501 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, ప్రభుత్వంపై అదనపు భారం పడకుండా జిల్లాలో అద్దె భవనాల్లో నడుస్తున్న 501 అంగనవాడి కేంద్రాలను శాశ్వత ప్రాతిపదికన త్వరలోనే నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అంగన్వాడీ టీచర్లు మరియు హెల్పర్ల జీతభత్యాల పెంపుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ దిశగా ఒక స్పష్టమైన ప్రణాళిక రూపొందించి అమలు పరచడం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలపై నిర్లక్ష్య ధోరణి అవలంబించారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అంగన్వాడీల సంక్షేమం కోసం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా అందజేయడం జరుగుతుందని, గత ప్రభుత్వ హయాంలో రిటైర్ అయిన వారికి కూడా ఈ ప్రభుత్వం ఒక కొత్త జీవో తెచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్



అందేవిధంగా కృషి చేసిందని, ఆ ఘనత రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు దక్కుతుందని తెలిపారు.
? అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. దీనివల్ల గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ విధానంలో త్వరగా నమోదు చేయవచ్చు అని, అంగనవాడి టీచర్ల పని భారం తగ్గించడానికి ప్రభుత్వ మొగ్గు చూపిందని, గతంలో అంగనవాడి టీచర్లు వారి కేంద్ర పరిధిలో నమోదైన లబ్ధిదారులకు అందిస్తున్న సేవలను సుమారు 16 రిజిస్టర్లలో నమోదు చేయాల్సి ఉండగా వారి పని భారం తగ్గించి కాలానుగుణంగా అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్మార్ట్ ఫోన్లు ప్రభుత్వం అందజేసిందని, క్షేత్రస్థాయిలో అంగనవాడి టీచర్లు కేంద్రాలలో నమోదైన గర్భిణీలు, బాలింతలు పిల్లలకు సరైన సమయంలో సరైన పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారము ప్రాజెక్టు, సెక్టార్ మరియు అంగనవాడి కేంద్ర స్థాయిలో పౌష్టికాహార విలువలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, ఈ 15 రోజులు నిర్వహించే రోజు వారి కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులను, గ్రామ పెద్దలను, గర్భిణీలును బాలింతలను భాగస్వామ్యం చేసి అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలతో పాటు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య స్థితిగతులపై నివేదిక అందజేయడం జరుగుతుందని ,దాని అనుగుణంగా భవిష్యత్తులో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని తెలిపారు. ప్రతినెల మొదటి వారంలో అంగనవాడి కేంద్రాలలో నమోదైన ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఎత్తు బరువులు తూచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా అప్లికేషన్లలో నమోదు చేసినట్లయితే అతి తీవ్ర పోషణ లోపం, తీవ్ర పోషణ లోపం, పోషణ లోపం అనేది సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించడం జరుగుతుందని, దాని ద్వారా స్థానిక వైద్యాధికారుల సూచనల మేరకు న్యూట్రిషన్ రిహాబిటేషన్ సెంటర్ కు సిఫార్సు చేసి ప్రత్యేక పర్యవేక్షణ ఆ యొక్క పిల్లలపై పెట్టి సాధారణ స్థితికి వచ్చేవరకు అంగనవాడి టీచర్ బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈరోజు అంగనవాడి టీచర్ల స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రెండు కోట్ల మూడు లక్షల 50 వేల రూపాయల విలువైన అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం జరిగిందని, ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులకు నాణ్యత మరియు పారదర్శకత తో కూడిన సేవలు అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా ఎడిషన్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రామసాయం నరేష్ రెడ్డి, సిడిపివోలు, ఏసిడిపివోలు, సూపర్వైజర్లు, అంగనవాడి టీచర్లు, హెల్పర్లు పాల్గొనడం జరిగింది.

# ఎన్ని పార్టీలు కలిసినా మాపై విజయం సాధించలేవు

-తమిళనాడు సీఎం స్టాలిన్



**టి మీడియా,ఏప్రిల్ 11, చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని తమ కూటమి కచ్చితంగా విజయం సాధిస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో కనిపిస్తున్న అఖండ ప్రజాస్పందనే దీనికి కారణమని పేర్కొన్నారు. ఇంతకు ముందు డీఎంకే నేతృత్వంలోని కూటమి 200 కంటే ఎక్కువ నియోజక వర్గాల్లో విజయం సాధిస్తుందని అంచనా వేశాం. కానీ ప్రస్తుతం ఉన్న ప్రజామద్దతు, జనసందోహాన్ని చూస్తుంటే, మొత్తం 234 నియోజక వర్గాల్లోనూ మా కూటమి విజయం సాధించే అవకాశం ఉంది అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో స్టాలిన్ కొలత్తూరు నియోజకవర్గం నుంచి డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా విపక్షాలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఏ ప్రతిపక్ష శక్తి కూడా తమను ఓడించలేదని, అందువల్ల ప్రత్యర్థుల గురించి తమ కూటమికి ఎలాంటి ఆందోళన లేదని అన్నారు.

## ఇది తమిళనాడు వర్సెస్ ఢిల్లీ

ప్రస్తుత ఎన్నికలు 'తమిళనాడు వర్సెస్ ఢిల్లీ' అని స్టాలిన్ పదేపదే చెబుతున్నారు. దీనిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ, "ఏఐఏడీఎంకే పార్టీని ఢిల్లీకి తాకట్టు పెట్టారు. ఆ పార్టీ ఢిల్లీకి లొంగిపోయింది. ఏఐఏడీఎంకే పార్టీకి ఎలాంటి సిద్ధాంతాలు, ఆశయాలు లేవు. ఆ పార్టీ పూర్తిగా ఢిల్లీ కనుసన్నల్లో పనిచేస్తోంది. ఢిల్లీలోని బీజేపీ కార్యాలయమే, ఏఐఏడీఎంకేకు ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. ఆ పార్టీ నాయకులు బానిసలుగా మారారు. తమిళ హక్కులను తాకట్టు పెట్టేవారిని ఇంకేమని పిలవాలి? ఢిల్లీ ఆడించినట్లు ఆడేవారిని బానిసలు అనక ఇంకేమంటారు? ఒక ద్రవిడ పార్టీ ఇలాంటి స్థితికి చేరుకోవడం ఆందోళనకరం. నిరాశ కలిగించే అంశం. కానీ మేము మాత్రం వెనక్కు తగ్గం. కాబట్టి ఈ పోరాటం తమిళనాడు, ఢిల్లీ మధ్యనే కొనసాగుతుంది" అని స్టాలిన్ పేర్కొన్నారు.
, నటుడు, టీవీకే అధినేత విజయ్? సహా మిగతా సినిమా నటులను అనుసరిస్తూ యువత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఘటనలపై స్టాలిన్ స్పందించారు. 'రాష్ట్ర ప్రజలు ఇలాంటివన్నీ చూస్తున్నారు. వారే తగిన సమాధానం చెబుతారు' అని అన్నారు.

## సంక్షేమ పథకాలు అందించాం!

ఓ ప్రముఖ న్యూస్ ఏజెన్సీకి ఇంటర్వ్యూ ఇస్తూ, గత ఐదేళ్ల తమ ద్రవిడ్ మోడల్? పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామని స్టాలిన్ తెలిపారు. నెలకు రూ.1000 అందించే 'కలైజ్ఞర్? మహిళా హక్కు పథకం', మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పాఠశాల పిల్లలకు అల్పాహార పథకం, రెండు లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్? కనెక్షన్లు లాంటి అనేక సంక్షేమ పథకాలు చేపట్టామన్నారు.

## కాంగ్రెస్?తో సీట్ల సర్దుబాటు సంగతేంటి?

డీఎంకే, కాంగ్రెస్ సీట్ల సర్దుబాటు అంశంపై కూడా స్టాలిన్ మాట్లాడారు. సీట్ల సర్దుబాటు చాలా కఠినంగా అనిపించిందా? అని ప్రశ్నించగా, "సీట్ల కేటాయింపు సమయంలో ఇలాంటి పరిస్థితులు సహజం. కానీ చర్చలు చాలా స్నేహపూర్వక ఏ హా తా వ ం ణ ం లో ముగిశాయి. నా నేతలు, కార్యకర్తలు కూటమి అభ్యర్థుల విజయం కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. 2019 నుంచే మా కూటమి బలంగా ఉంది. ఇప్పుడు కొత్త పార్టీల చేరికతో అది మరింత బలపడింది" అని స్టాలిన్ అన్నారు. కేవలం తమిళనాడులోనే కాకుండా, పుదుచ్చేరిలో కూడా తమ కూటమి అద్భుత విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## పన్నీర్?సెల్వంను ఎందుకు చేర్చుకున్నారు!

మూడు సార్లు ఏఐఏడీఎంకే తరఫున ముఖ్యమంత్రిగా పనిచేసిన ఓ.పన్నీర్?సెల్వంను పార్టీకి చేర్చుకోవడంపై స్టాలిన్ మాట్లాడారు. "ఏఐఏడీఎంకే పరిస్థితి ప్రజలకు బాగా తెలుసు. ద్రవిడ ఉద్యమ సిద్ధాంతాల్లో పెరిగినవారు సహజంగానే ఆ ఉద్యమానికి పుట్టినిల్లు లాంటి డీఎంకేలో చేరుతారు" అని అన్నారు. అలాగే డీఎండీకే పార్టీకి 10 సీట్లు కేటాయించడంపై మాట్లాడుతూ, మిత్రపక్షాలను గౌరవించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడమే తమ మార్గమని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

## ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తారా?

జాతీయ స్థాయిలో 'ఇండియా' కూటమిలో కీలక పాత్ర పోషించడంపై అడిగిన ప్రశ్నకు స్టాలిన్ తనదైన రీతిలో సమాధానం ఇచ్చారు. తన తండ్రి కరుణానిధి గతంలో చెప్పిన మాటలు గుర్తు చేస్తూ, తన పరిమితులు తనకు తెలుసునని అన్నారు. స్టాలిన్ కుటుంబం ఒక అధికర కేంద్రంగా మారిందని ఎడప్పాడి పళనిస్వామి చేసిన ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. అది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం మాత్రమేనని, తన ప్రభుత్వం సాధించిన విజయాలకు బదులు చెప్పలేక ఇలాంటి కల్పిత కథలు చెబుతున్నారని విమర్శించారు.

ఇక మహిళలపై జరుగుతున్న నేరాల గురించి పళనిస్వామి చేస్తున్న ఆరోపణలపై స్టాలిన్ ఘాటుగా స్పందించారు. పొల్లాచ్చి లైంగిక వేధింపుల కేసు ఏఐఏడీఎంకే హయాంలో జరిగిన ఘోరాలకు నిదర్శనమని అన్నారు. అప్పట్లో ఒక మహిళా ఐపీఎస్? అధికారిణి కూడా వేధింపులకు గురయ్యారని గుర్తు చేశారు. మణిపుర్?ను హింసా భూమిగా మార్చిన వారితో పొత్తుపెట్టుకున్న పళనిస్వామికి శాంతి భద్రతల గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు.
తమిళనాడును ఏఐఏడీఎంకే గుట్కా గిడ్డంగిలా మార్చి, మహిళల రక్షణను గాలికి వదిలేసిందని, కానీ డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత, తాము కఠిన చర్యలు తీసుకొని మాదక ద్రవ్యాలను నిర్మూలించామన్నారు. మహిళల ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రత్యేకంగా 'తోళి' (స్నేహితురాలు) హాస్టళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలపై నేరాలకు పాల్పడేవారికి, త్వరగా కఠిన శిక్షలు పడేలా చట్టాలను సవరించామని అన్నారు. భారతదేశంలో మహిళలకు అత్యంత సురక్షితమైన రాష్ట్రంగా తమిళనాడు ప్రథమ స్థానంలో ఉందని ఆయన పేర్కొన్నారు.

## త్రిముఖ పోటీ

కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్? 23న ఒకే దశలో జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది. ప్రధాన పోటీ డీఎంకే నేతృత్వంలోని ఎస్?పీఏ (ఇందులో కాంగ్రెస్?, డీఎంకే, వీసీకే)కు, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్? (బీజేపీ, పీఎంకే) మధ్య ఉంటుందని భావించారు. కానీ ఈసారి తమిళ అగ్ర నటుడు విజయ్ టీవీకే పార్టీ పెట్టి, ఎన్నికల బరిలోకి దిగారు. దీనితో తమిళనాట త్రిముఖ పోటీ నెలకొంది.